ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 1.08.2005 సమయం 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి చేపట్టి విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపుతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం ఒకటో యూనిట్ ను ఈ ఉదయం జాతికి అంకితం చేశారు.
2. రాష్ట్రంలో పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క తెలిపారు.
3. ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాల గడువును ఈ నెల 20వ తేదీ వరకు పెంచినట్టు రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది.
4. రాష్ట్రంలో రాగల ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

యాదాద్రి థర్మల్ ప్లాంట్-భట్టి

పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేపట్టి రాష్ట్రంలో విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపుతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం, వీర్లపాలెం వద్ద ఉన్న యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఒకటో యూనిట్ ను భట్టి విక్రమార్క ఈ ఉదయం ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ప్రాజెక్టులో మరిన్ని యూనిట్లను కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 970 కోట్ల రూపాయల వ్యయంతో పవర్ ప్లాంట్ ఆవరణలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం యాదాద్రి పవర్ ప్లాంట్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి హైడ్రో, థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

(సౌండ్ బైట్ సీతక్క)

(పీటీసీ, నల్లగొండ)

ములుగు పోలీస్-సీతక్క

పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బందికి ఫిజికల్ ఫిట్ నెస్ తప్పనిసరి అని, క్రీడలు పోలీసుల్లో ఉత్తేజాన్ని నింపుతాయని మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా లోని జాకారం పోలీస్ శిక్షణ కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోలీస్ క్రికెట్ స్టేడియంను నిన్న రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంరక్షణే ప్రథమ కర్తవ్యం అయినప్పటికీ పోలీసలు తమ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలని సూచించారు.

(PTC Mulugu Dist)

ఇంటర్ ప్రవేశాల గడువు

2025-26 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాల గడువును పెంచుతున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. ఇటీవల పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలైన నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రవేశాల చివరి తేదీని ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు బోర్డు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. గడువు పెంపు ఇదే చివరిసారి బోర్డు స్పష్టం చేసింది. అర్హులైన విద్యార్థులు కేవలం బోర్డు గుర్తింపు పొందిన జూనియర్ కళాశాలల్లో మాత్రమే అడ్మిషన్లు తీసుకోవాలని బోర్డు కీలక సూచన చేసింది.

(డెస్క్)

కొత్తగూడెం-డీఈవో

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈరోజు నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఉపాధ్యాయులు ముఖ గుర్తింపు -FRS ద్వారానే తమ హాజరును నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటాచారి తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా విద్యా బోధనలో మరింత పారదర్శకత, నాణ్యత పెరుగుతాయని తెలిపారు.

(బైట్ డీఈవో వెంకటాచారి)

(పీటీసీ, భద్రాద్రి కొత్తగూడెం)

ఆసిఫాబాద్ –ముఖ హాజరు

ఉపాధ్యాయుల హాజరు పక్కాగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ముఖ హాజరు ప్రక్రియ జిల్లాలో ఆసిఫాబాద్ ఈ రోజు ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ పాఠశాలలో ముఖ హాజరు ప్రక్రియను మండల విద్యాధికారి రాథోడ్ సుభాష్ పరిశీలించారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

గిరిజన గురుకులంలో నటరాజన్ శ్రమదానం

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిన్న చేపట్టిన జనహిత పాదయాత్ర వికారాబాద్ జిల్లాలో ఈరోజు కొనసాగుతోంది. ఉదయం పరిగి విద్యారణ్యపురిలోని గురుకుల బాలికల పాఠశాల వసతి గృహం ఆవరణలో ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ శ్రమదానం చేసి, మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

(పీటీసీ, వికారాబాద్)

సంగారెడ్డి - పాదయాత్ర

ఇదిలావుండగా జనహిత పాదయాత్ర ఈరోజు సాయంత్రం సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో సాగనుంది పాదయాత్ర విజయవంతం అయ్యేలా అన్ని ఏర్పాట్లు చేసినట్టు మంత్రి దామోదర్ రాజనర్సింహ్ తెలిపారు. యాత్రతో పాటు శ్రమదానం , కార్యకర్తలతో సమావేశం ఏర్పాట్లను మంత్రి స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు.

(SANGAREDDY. PTC)

ఉజ్వల్ యోజన* షెడ్యూల్ బైట్ సిరిసిల్ల

ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకం కింద తమ కుటుంబానికి వచ్చిన గ్యాస్ సిలిండర్ తో గతంలోకట్టెల పొయ్యిపై వంట చేయడం మూలంగా కలిగే ఆరోగ్య సమస్యలు తప్పాయని రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన లబ్దిదారు కొట్టె ప్రమీల ఆకాశవాణితో తెలిపారు.

( బైట్ ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం లబ్ధిదారు కొట్టె ప్రమీల)

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

వాతావరణం

రాష్ట్రంలో రాగల ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీనితో పాటు రానున్న ఐదు

రోజుల పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది.

(డెస్క్)

పెద్దపల్లి

పెద్దపల్లి జిల్లాలోని సబ్బితం జలపాతం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆరు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో జలపాతం చుట్టూ రహదారి, సీటింగ్, వ్యూయింగ్ పాయింట్లు వంటి సౌకర్యాలు కల్పించనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ జలపాతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించి, పర్యాటక రంగానికి ఊతం ఇవ్వాలని భావిస్తోంది. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా, సబ్బితం గ్రామం నుండి జలపాతం వరకు 3 కిలోమీటర్ల రహదారిని నిర్మించనున్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే, సబ్బితం జలపాతం ఒక ముఖ్యమైన పర్యాటక కేంద్రంగా మారనుంది, ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ఎంతో దోహదపడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

PTC

సిరిసిల్ల- తల్లిపాల వారోత్సవాలు

తల్లిపాలు శిశువుకు వ్యాధి నిరోధక శక్తిని అందించి రక్షణగా నిలుస్తాయని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ఈ రోజు ఎల్లారెడ్డిపేట మండలం కిషన్‌దాస్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. తెలిపారు.

(పీటీసీ, సిరిసిల్ల)

సిరిసిల్ల-క్రీడలు

భారత క్రీడాకారుడు నీరజ్ చోప్రా ఒలింపిక్స్ లో స్వర్ణ పతకం సాధించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ సిరిసిల్లాలో రేపు జావెలిన్ డే నిర్వహిస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా అథ్లెటిక్స్

సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్ర శేఖర్ తెలిపారు. సిరిసిల్ల లో జావెలిన్, పరుగు పందెం పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిని ఈ నెల 7న జనగాంలో జరిగే రాష్ట్ర పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 79014 64456 నంబరును సంప్రదించాలని కోరారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

వాలీబాల్ పోటీలు - జగిత్యాల

క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని చేకూర్చడంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని బలోపేతం చేస్తాయని జగిత్యాల జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ మైదానంలో మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ఎస్పీ ఈ రోజు ప్రారంభించారు.

(జగిత్యాల జిల్లా పీటీసీ)

మహబూబాబాద్ -ఎరువులు

మహబూబాబాద్ జిల్లాలో రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇంచార్జి వ్యవసాయాధికారి అజ్మీర శ్రీనివాసరావు హెచ్చరించారు. మహబూబాబాద్ పట్టణంలో పలు ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, ధరల పట్టిక రైతులకు కనిపించే విధంగా ప్రదర్శించాలని సూచించారు.

(మహబూబాబాద్ జిల్లా,పి.టి.సి.)

సిరిసిల్ల –చేనేత కళాకారుడు

'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత ప్రభుత్వం నిర్వహించిన సైనిక చర్యలను అభినందిస్తూ ఆ చిత్రంతో కూడిన బంగారు పోగుల శాలువను రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల చేనేత కళాకారుడు నల్ల విజయకుమార్ చేనేత మగ్గంపై నేశారు. అగ్గి పెట్టెలో ఇమిడిపోయే ఈ

శాలువాను రెండు గ్రాముల బంగారం పోగులు, పట్టుజరీ నూలుతో రెండు మీటర్ల పొడవు, 36 అంగుళాల వెడల్పు, 80 గ్రాముల బరువుతో నేశారు. దీన్ని ఈనెల 7న చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పంపనున్నట్లు విజయ్ కుమార్  తెలిపారు.

(పీటీసీ, సిరిసిల్ల)

ఆసిఫాబాద్-ఎస్పీ

మహిళలు, చిన్నపిల్లలపై అత్యాచారం, వేధింపుల వంటి వాటిని రక్షించడమే భరోసా సెంటర్ లక్ష్యమని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్ లో ఎస్పీ ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలు, విద్యార్థులు ఏ రకమైన వేధింపులకు గురైనా జిల్లా భరోసా సెంటర్ 8712670561, డయల్ 100,112 కు సమాచారం అందించాలని సూచించారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

ఆసిఫాబాద్ -ముస్కాన్

ఆసిఫాబాద్ జిల్లాలో జులై నెలలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ లో 48 మందిని రక్షించినట్లు జిల్లా బాలల సంక్షేమ అధికారి మహేష్ తెలిపారు. వీరిలో 41 మందిని బాల కార్మికులుగా గుర్తించామని వెల్లడించారు. నిన్నటితో ఆపరేషన్ ముస్కాన్ ముగిసినప్పటికీ నిరంతరం బాల కార్మిక వ్యవస్థపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు పనిలో ఉంటే వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

(పీటీసీ ఆసిఫాబాద్)

నల్లగొండ-లయన్స్ క్లబ్

మరణం తర్వాత చేసే నేత్రదానం ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపుతుందని లయన్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కెవి ప్రసాద్ అన్నారు. నల్లగొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర, పార్థివ దేహ దాతల కుటుంబాలకు కృతజ్ఞత సభ నిర్వహించారు. గత ఏడాది కాలంలో 157 మంది నేత్రదానం చేయగా, నలుగురు పార్థివ దేహ దానం చేశారు. వీరి ద్వారా సేకరించిన

314 కార్నియాలతో, 314 మంది అంధులకు కంటిచూపును అందించగలిగామని కేవి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యులను సన్మానించి, మరణించిన దాతలకు నివాళులర్పించారు. (పీటీసీ, నల్లగొండ)